RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 18 నవంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 189 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## ఘన వ్యర్థాల నిర్వహణకు 2016 నిబంధనలు అమలు చేయాల్సిందే: సుప్రీంకోర్టు

2లో..



### విశ్వసుందరిగా నిలిచిన
# డెన్మార్క్ బ్యూటీ

మెక్సికో, (ప్రభాత సూర్యుడు): మిస్ యూనివర్స్ పోటీల్లో డెన్మార్క్‌కు చెందిన 21 ఏళ్ల విక్టోరియా కెజార హెల్విగ్ విజేతగా నిలిచింది. మెక్సికో వేదికగా జరిగిన మిస్ యూనివర్స్ 2024 పోటీల్లో 125 మంది పోటీ పడగా.. విక్టోరియా విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన మిస్ యూనివర్స్ 73వ ఎడిషన్ పోటీల్లో విజేతగా నిలిచిన విక్టోరియాకు 2023 మిస్ యూనివర్స్ షెన్నిస్ పలాసియోస్ విశ్వసుందరి కిరీటాన్ని అలంకరించింది. ఈ మిస్ యూనివర్స్ పోటీల్లో నైజీరియాకు చెందిన చిడిమ్మ అడెట్షినా మొదటి రన్నరప్‌గా నిలిచింది. మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండా బెల్ట్రాన్ రెండో రన్నరప్‌గా నిలిచింది. ఈ మిస్ యూనివర్స్ 2024 గ్రాండ్ ఫినాలేలో భారత్‌కు చెందిన రియా సింఘా కూడా పాల్గొంది. అయితే ఆమె టాప్ 30లోనే ఆగిపోయింది.


# ఫోటో షూట్ కోసమే మూసీ నిద్ర

### మూడు నెలలు బస చేయండని సవాల్
### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రాజెక్టు ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫోటో షూట్ కోసం మూసీ నిద్ర చేశారని అన్నారు. బస చేసే ముందు ఆ ప్రాంతంలో దోమల మందు, ఈగల మందు కొట్టారు.. మూడు నెలలు అక్కడ ఉంటే ప్రజల అవస్థలు తెలుస్తాయని పేర్కొన్నారు. మూసీ పక్కన మూడు నెలల బస చేయండని మా సీఎం సవాల్.. నేను కూడా వస్తాను. మీరు నేను ఇద్దరం కలసి మూడు నెలలు అక్కడ బస చేద్దాం రండి అని సవాల్ చేశారు. అక్కడి ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ పడిన ప్రతీసారి కిషన్ రెడ్డి బయటకి వస్తారు.. బీఆర్ఎస్ ను ప్రొటెక్ట్ చేయడానికి కిషన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఒక్కరోజు నిద్ర చేసి ఏం సాధించారని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి అందుకు అడ్డుపడుతున్నారు.. సబర్మతి రివర్ ఫ్రంట్‌కి ఒక న్యాయం.. మూసీ రివర్‌కి ఒక న్యాయమా..? అని

..మిగతా 2లో





# భారత్ అరుదైన ఘనత

### హైపర్ సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): హైపర్ సోనిక్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి డీఆర్‌డీవో ఈ క్షిపణిని ఆదివారం ఉదయం విజయవంతంగా పరీక్షించింది. ఇది 1500 కిలోమీటర్లకు మించిన వివిధ పే లోడ్లను సునాయాసంగా లక్ష్యానికి తీసుకెళ్లగలదు. ఈ విషయాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించడంతో భారత్ ఓ పెద్ద మైలు రాయిని దాటిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంతో అత్యాధునిక మిలటరీ టెక్నాలజీని సాధించిన అతి కొద్ది దేశఋాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయ్యిందని వెల్లడించారు.



### రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీకి
# ఎందుకంత సంతృప్తి?
### టీపీసీసీపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీ సంతృప్తిగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే రాష్ట్ర పాలనపై ఏఐసీసీ సంతృప్తి చెందిందా అని ప్రశ్నించారు. అసలు రాష్ట్రంలో పాలన అనేది ఒకటి ఉంటే కదా..? ఇంతకంటే దిక్కుమాలిన ప్రకటన ఇంకోటి ఉంటదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకీ ఏఐసీసీకి అంత సంతృప్తి ఎందుకు అని కేటీఆర్ పలు ప్రశ్నలు ప్రశ్నించారు.? తెలంగాణ రైతులకు సంకెళ్లు వేసినందుకా ? అమాయకులైన అన్నదాతలను జైలులో పెట్టినందుకా ?? కొడంగల్ లో బలవంతంగా భూములు గుంజుకున్నందుకా ?? కొనుగోలు కేంద్రాల్లో రైతులను బలిపశువులను చేస్తున్నందుకా ?? మూసీ ప్రాజెక్టులో

..మిగతా 2లో

### సీఎం మాటలు కోటలు దాటుతున్నా..
# చేతలు మాత్రం గడప దాటడం లేదు
### రేవంత్‌పై హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యలతో మరణ మృదంగం మోగుతున్నదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. గురుకులాల్లో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, గడిచిన 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి.. కానీ చేతలు మాత్రం గడప దాటడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవం నాడు సీఎం ప్రగల్భాలు పలకడం తప్ప.. ఎలాంటి కార్యచరణకు దిక్కులేదని అన్నారు. సంగారెడ్డి జిల్లా బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిన్న మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడటం శోచనీయమని పేర్కొన్నారు. ఈ చావులు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. దీనికి



సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వాంకిడిలో గురుకులంలో పాఠాలు వినాల్సిన విద్యార్థిని గత 17 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని హరీశ్‌రావు అన్నారు. దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలనుకున్న బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణం ఎవరని నిలదీశారు. సంగారెడ్డి బీసీ గురుకులంలో ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి ఆత్మహత్యకు కారణం ఎవరని అడిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే, గురుకులాలలో గత 11 నెలల్లో సగటున నెలకు ముగ్గురు ప్రాణాలు కూలిపోతున్నారని.. ఈ మరణాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ లోనూ ఇదే దుస్థితి కొనసాగడం దురదృష్టకరమని హరీశ్‌రావు మండిపడ్డారు. ఘనత వహించిన కాంగ్రెస్ పాలనలో ముగ్గురు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని.. ఈ మరణాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిన గురుకులాలు..

..మిగతా 2లో



### ఒక్కరు కాదు.. తెలంగాణకు
# ఇద్దరు సీఎంలు
### బండి సంజయ్

సంగారెడ్డి, (ప్రభాత సూర్యుడు): లగచర్ల ఫార్మాసిటీకి తాము వ్యతిరేకం కాదని, అయితే రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కేంద్రహెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కోరారు. సంగారెడ్డిలో ఆదివారం (నవంబర్17) బండి సంజయ్ ఈ మేరకు మీడియాతో మాట్లాడారు. 'రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి. రైతుల గురించి ఆలోచించకుండా దౌర్జన్యం చేయడానికి ఇది రాచరిక పాలనా? గతంలో బీఆర్ఎస్ కూడా ఇలానే చేసింది. కలెక్టర్‌పై దాడి అనేది దారుణం. రైతులు కలెక్టర్‌పై దాడి చేయలేదు. ఈ దాడి వెనుక కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారని

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సీఎం మాటలు కోటలు దాటుతున్నా..
# చేతలు మాత్రం గడప దాటడం లేదు

**మొదటి పేజీ తరువాయి...**

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకి దిగజారిపోతుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరకకూపాలుగా మారాయని అన్నారు. విద్యా శాఖతో పాటు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, మైనార్టీ శాఖలు నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం, అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహించే శాఖల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక మిగతా శాఖల పనితీరు గురించి చెప్పాల్సిన పనిలేదని హరీశ్‌రావు అన్నారు. ఇంకెంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవాలి ముఖ్యమంత్రి గారూ అని నిలదీశారు. ఇంకెప్పుడు మీ కార్యచరణ మొదలుపెట్టి విద్యార్థులను కాపాడుతారని ప్రశ్నించారు. ఈ చావులకు ప్రభుత్వం బాధ్యత వహించి, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఫోటో షూట్ కోసమే
# మూసీ నిద్ర



**మొదటి పేజీ తరువాయి...**

ప్రశ్నించారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చి ఆదుకుంటాం.. వారి పిల్లలకు విద్య అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతుంది అనగానే.. వీళ్లకు భయం పట్టుకుందని అన్నారు. గుజరాత్‌ను ఎక్కడ తెలంగాణ వెనక వేస్తుందో అన్న భయం బీజేపీని వెంటాడుతుందని పేర్కొన్నారు. ప్రళయాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.. ఒక్కరోజు నిద్రతో అక్కడి ప్రజల అవస్థలు ఏం తెలుసుకున్నారో చెప్పండని ప్రశ్నించారు. డీపీఆర్ వచ్చాక ఎక్కడ రిటర్నింగ్ వాల్ కట్టలో తెలుస్తుంది.. ఎవరికి అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పదేళ్లు తెలంగాణ అభివృద్ధి కుంటు పడింది.. అభివృద్ధిలో తెలంగాణ మార్పు చూస్తారు.. తెలంగాణ రైజింగ్ గా ముందుకు వెళ్తుందని తెలిపారు. మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి కాళ్ళకు సాక్సులు వేసుకొని నిద్రపోయారు.. అంటే అక్కడ ఎన్ని దోమలు ఉన్నాయో అర్థం అవుతుంది.. బీజేపీ, బీఆర్ఎస్ ఎవరికి ఆపద వచ్చినా ఒకరిని ఒకరు పరస్పరం ఆదుకుంటున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు.

# మణిపూర్‌లో నిరసనలు తీవ్రం
## మరో నలుగురు ఎమ్మెల్యేల ఇళ్లు దగ్ధం



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** మరోసారి మణిపూర్ రగిలిపోతుంది. ఇంఫాల్ లోయలోని కొన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఈ క్రమంలో.. ముగ్గురు భారతీయ జనతా పార్టీ, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాసాలపై దాడి చేశారు. ఆందోళనకారులు ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ వ్యక్తిగత నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. నవంబర్ 11న భద్రతా దళాలు 10 మంది హ్మార్ పురుషులను చంపారు. ఆ ప్రదేశానికి సమీపంలోని నిర్వాసిత ప్రాంతం శిబిరం నుంచి ఆరుగురు మైతే జాతి వారు అదృశ్యమై చివరికి వారి మృతదేహాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిణామాలు మణిపూర్‌లో తాజా హింసకు కారణమైయ్యాయి. హతమైన వారిని భద్రతా దళాలు మిలిటెంట్లుగా అభివర్ణించాయి. ఈ క్రమంలో.. శనివారం ఇంఫాల్ లోయలోని వివిధ ప్రాంతాలలో హింసాత్మక నిరసనలు చెలరేగాయి. ఫలితంగా నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు.

**ఎమ్మెల్యేల నివాసాలపై దాడి:**
ఇంఫాల్ లోయలోని పలు ప్రాంతాల్లో ఆందోళనకారులు బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లకు నిప్పుపెట్టి ఆస్తులను ధ్వంసం చేశారు. నింగ్‌తౌఖోంగ్‌లో పబ్లిక్ వర్క్స్ మంత్రి గోవిందదాస్ కొంతౌజామ్, హ్యాంగ్లామ్ బజార్‌లో బీజేపీ ఎమ్మెల్యే వై రాధేశ్యామ్, తౌబాల్ జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే పవోనమ్ బ్రోజెన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే లోకేశ్వర్ ఇళ్లకు నిప్పుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ సమయంలో ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

**ముఖ్యమంత్రి పూర్వీకుల ఇంటిపై దాడి:**
ఆందోళనకారులు ఇంఫాల్ తూర్పు జిల్లాలోని లువాంగ్‌సంగ్‌బామ్‌లో ఉన్న బీరెన్ సింగ్ పూర్వీకుల ఇంటిపై కూడా దాడికి ప్రయత్నించారు. అయితే, భద్రతా బలగాలు 100-200 మీటర్ల ముందుగానే వారిని అడ్డుకున్నాయి. దీంతో ఆందోళనకారులు సింగ్ ఇంటికి వెళ్లే ప్రధాన రహదారిపై టైర్లు తగలబెట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.

**కర్ఫ్యూ, ఇంటర్నెట్ సేవలు నిలిపివేత:**
పరిస్థితిని అదుపు చేసేందుకు ఇంఫాల్ లోయలోని పలు జిల్లాల్లో పరిపాలన నిరవధిక కర్ఫ్యూ విధించింది. అలాగే ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. ముఖ్యమంత్రి అల్లుడు, బీజేపీ ఎమ్మెల్యే రాజ్ కుమార్ ఇమో సింగ్ సహా నేతల ఇళ్లపై దాడులు జరగడంతో ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను అధికారులు నిలిపివేశారు.

**ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి:**
రాష్ట్రంలోని పౌర సమాజ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మణిపూర్ ఇంటిగ్రిటీ కోఆర్డినేషన్ కమిటీ (%జూజూవీ×%) ఉగ్రవాదులపై సైనిక చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల మళ్లీ విధించిన (సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం)ని తక్షణమే తొలగించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

**నిరసనలు, కాల్పుల ఘటనలు:**
జిరిబామ్ పట్టణంలో ఉగ్రవాదులు కనీసం రెండు చర్చిలు, మూడు ఇళ్లకు రాత్రిపూట నిప్పుపెట్టినట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా.. ఇతర నిర్మాణాలను కాల్చడానికి ప్రయత్నం చేశారు. మణిపూర్‌లో ఈ హింస, ఉద్రిక్తత రాష్ట్ర పౌరులకు తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తోంది. పరిపాలన, భద్రతా బలగాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు ఇంకా అనేక ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి.

## రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీకి
# ఎందుకంత సంతృప్తి?

**మొదటి పేజీ తరువాయి...**

భాగంగా వేల ఇళ్ల కూల్చివేతకు సిద్ధమైనందుకా ?? హైడ్రా పేరిట పేద ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నందుకా ? ఏడాది కావస్తున్నా గ్యారెంటీ కార్డును పాతాళంలో పాతిపెట్టినందుకా ?? రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలును గాలికి వదిలేసినందుకా ?? తెలంగాణ ప్రగతికి బ్రేకులు వేసి.. ఆర్థికంగా దివాలా తీయిస్తున్నందుకా ?? సంక్షేమానికి సమాధి కట్టి.. అభివృద్ధికి అడ్రస్ లేకుండా చేసినందుకా ?? తెలంగాణలోని సకల రంగాలను.. సబ్బండ వర్గాలను దగా చేసినందుకా.. మొత్తంగా తెలంగాణను ఆగం చేసినందుకా.. మీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అంతటి సంతృప్తి అని ప్రశ్నించారు. ఢిల్లీకి అందుతున్న వేల కోట్ల మూటలు చూసి మీరెంత మురిసిపోయినా.. మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రిని.. గ్యారెంటీ కార్డు ఇచ్చి గారడీ చేసిన కాంగ్రెస్ పార్టీని చూసి, నాలుగు కోట్ల తెలంగాణ సమాజం మాత్రం రగిలిపోతోందని కేటీఆర్ అన్నారు. కనికరం లేని కాంగ్రెస్ పాలనకు కర్రుగాల్చి వాతపెడుతుందని మండిపడ్డారు.

# పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుని 'మూసీ నిద్ర'
## మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** బీజేపీ చేపట్టిన 'మూసీ నిద్ర' కార్యక్రమంపై తెలంగాణ మంత్రులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. తాజాగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుని బీజేపీ నాయకులు మూసీ నిద్ర కార్యక్రమం చేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలు నిజంగా తెలుసుకోవాలనుకుంటే ఆలౌట్లు, మస్కిటో కాయిల్స్ అవసరమా అని అన్నారు. కిషన్ రెడ్డికి ఇప్పటికైనా ఆ ప్రాంత వాసుల సమస్య తెలిసిరావొచ్చు.. కలుషితమైన నీరు, గాలి మధ్య దుర్భర జీవితం గడుపుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మూసీ నిర్వాసితుల కష్టాలు తెలవాలంటే అక్కడికి వెళ్లి ఉండాలని సీఎం అన్నారు.. రాష్ట్రంలో పార్టీపై నిందలు వేస్తే మహారాష్ట్రలో ఓట్లు వస్తాయని మూసీ నిద్ర ఎంచుకున్నారని ఆరోపించారు. మంచి నీరు, మంచి ఇల్లు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం చూస్తుంది.. ఓట్లు వేసి ఎంపీగా, ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే ప్రక్షాళన అడ్డుపడుతున్నారని మంత్రి మండిపడ్డారు. గోడలు కడితే సరిపోతుంది అంటూ బీజేపీ నాయకులు అంటున్నారు.. డీపీఆర్ రానివ్వండి శాస్త్రీయంగా గోడలే కట్టాలో.. ఇంకేమైనా చేయాలో సలహాలు ఇవ్వండని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## ఘన వ్యర్థాల నిర్వహణకు 2016 నిబంధనలు అమలు చేయాల్సిందే : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** దేశ రాజధాని ఢిల్లీలో ఘన వ్యర్థాల నిర్వహణపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలులో ప్రభుత్వ ఏజెన్సీలన్నీ విఫలమయ్యాయంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేక్ హోల్డర్లందరితో సమావేశం ఏర్పాటు చేసి ఈ అంశంపై చర్చించాలని సీఎస్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలో 2016 నాటి నిబంధనలు సక్రమంగా అమలు చేయడం కీలకమని చెప్పింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ నెల 11న జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అధికారులంతారూ సమస్య పరిష్కారంపై ఏకతాటిపైకి రాలేదని.. 2016 నాటి ఆదేశాల అమలుకు సంబంధించి గడువును చెప్పకపోతే.. తామే కఠినమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా కోర్టుకు నివేదిక సమర్పించాలని స్టేక్ హోల్డర్లను కోర్టు ఆదేశించింది. సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను చెప్పేందుకు డిసెంబర్ 13 వరకు గడువు విధించింది. ఇతర కేసుల్లో మాదిరిగానే నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నిబంధనలు అమలు చేయడంలో విఫలమైతే దేశంలోని ఇతర నగరాల్లో ఏం జరుగుతుందో ఊహించవచ్చని చెప్పింది. ఈ అంశంపై విచారణను డిసెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో కాలుష్యంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. ఈ సందర్భంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ అంశం ప్రస్తావనకు వచ్చింది. 2026 నాటికి దేశ రాజధానిలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 11,000 టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని మించిపోతుందని ఢిల్లీ ఎండీసీ అక్టోబర్ 18న సుప్రీంకోర్టుకు తెలిపింది. జూలై 26న దేశ రాజధానిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను సరిగ్గా అమలు చేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో ప్రతిరోజూ 3వేల టన్నులకు పైగా ఘన వ్యర్థాలు శుద్ధి కాకుండా మిగిలిపోతున్నాయని.. ఇది ప్రజారోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతుందని పేర్కొంది. దేశ రాజధానిలో రోజుకు 11,000 టన్నులకు పైగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా, ప్రాసెసింగ్ ప్లాంట్ల రోజువారీ సామర్థ్యం 8,073 టన్నులు ఉందంటూ సుప్రీం కోర్టు ఎండీని మందలించింది.

# జైలుకు తమిళ నటి కస్తూరి
## ఈ నెల 29 వరకు రిమాండ్



**చెన్నై, (ప్రభాత సూర్యుడు):** తమిళ నటి కస్తూరికి చెన్నైలోని ఎగ్మోర్ కోర్టు ఈ నెల 29 వరకు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు పుఝల్ సెంట్రల్ జైలుకు కస్తూరిని తరలించారు. నిన్న(శనివారం) రాత్రి హైదరాబాద్‌లో కస్తూరిని చెన్నై పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేసులో కస్తూరికి ఎగ్మోర్ కోర్టు రిమాండ్ విధించింది. బ్రాహ్మణుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, అవమానితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో నవంబర్ 4న చెన్నైలో నిరసన కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో నటి కస్తూరి అంతఃపురంలో సేవ చేసేందుకు వచ్చిన వారే తెలుగువాళ్లని వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంలో తెలుగువారిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పి ఆ మాటలు వెనక్కి తీసుకున్నానన్నారు. ఇక్కడ తెలుగు మాట్లాడేవారు అంతఃపురంలో రాజ మహిళలకు సేవ చేసేందుకు వచ్చారంటూ కామెంట్ చేయడంతో పలువురి నుంచి వ్యతిరేకత వచ్చింది. కస్తూరి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కస్తూరి "తమిళుల మధ్య విభజన ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడే ద్రావిడ దయాస్పోరా మోసగాళ్ల ద్వంద్వ ప్రమాణాన్ని నిన్న నేను బయటపెట్టాను. డీఎంకే నాపై తెలుగు వ్యతిరేకులని దుష్ప్రచారం చేస్తూ నాపై దుష్ప్రచారం చేస్తోంది. నేను తెలుగువారికి వ్యతిరేకంగా మాట్లాడానంటూ ఫేక్ న్యూస్ ట్రెండ్ చేస్తున్నారు. బ్రాహ్మణ కమ్యూనిటీని వంటేరి అని పిలిచే వారు తమిళులేనా అని ప్రశ్నించాను. బ్రాహ్మణులపై ఇంత విద్వేషం ఎందుకు..వ్యక్తిగత దాడులను ఎదుర్కోలేక పోతున్నాను" అని ఆమె పేర్కొంది. కస్తూరి తెలుగువారిపై చేసిన వ్యాఖ్యలపై తమిళనాడులోని తెలుగుసంఘాలతో పాటు తెలంగాణ బీజేపీ కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. క్షమాపణలకు డిమాండ్ చేసింది. కస్తూరి క్షమాపణలు చెప్పినా తెలుగుసంఘాలు వెనక్కి తగ్గ లేదు. తమిళనాడువ్యాప్తంగా పలు జిల్లాల్లో పోలీసులకు తెలుగు సంఘాల నేతలు ఫిర్యాదు చేశారు.

## ఒక్కరు కాదు.. తెలంగాణకు
# ఇద్దరు సీఎంలు

**మొదటి పేజీ తరువాయి...**

కాంగ్రెస్ చెప్పింది. అయినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. ఇది ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం. కేటీఆర్ నక్క వినయం ప్రదర్శించి అన్ని ఛానెళ్లకు ఇంటర్వ్యూ ఇచ్చారు. కేసీఆర్ కొడుకు నటసార్వభౌముడు. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ హైకమాండ్‌ను కలిశారు. గతంలో కాళేశ్వరం,ఫోన్ ట్యాపింగ్ కేసును ఇలానే నీరు గార్చారు. ఫోన్‌ట్యాపింగ్ అనేది సిరిసిల్ల కేంద్రంగా జరిగింది. కేటీఆర్‌కు తెలియకుండా ఇది జరుగుతుందా. అప్పుడు,ఇప్పుడు సీఎం కేటీఆరే. దీపావళి బాంబులు ఎక్కడికి పోయాయి. ఫార్ములా-ఈ కేసు,ధరణి కేసు,జన్వాడ ఫామ్ హౌస్ కేసు,డ్రగ్స్ కేసు ఇవన్నీ ఎక్కడికి పోయాయి.జనాలని,మీడియాని కాంగ్రెస్, బీఆర్ఎస్ వాళ్లను పిచోళ్ళు చేస్తున్నారు. తెలంగాణకు ఇద్దరు ముఖ్యమంత్రులు ఒకరు కేటీఆర్, ఇంకొకరు రేవంత్‌రెడ్డి'అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇంటిపై
# బాంబుల దాడి

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇంటిపై బాంబు దాడి జరిగింది. సిజేరియా పట్టణంలోని నెతన్యాహు ఇంటిపై రెండు ఫ్లాష్ బాంబులతో దాడి జరగడంతో భారీ స్థాయిలో మంటలు చెలరేగాయి. ఘటన సమయంలో నెతన్యాహు, ఆయన కుటుంసభ్యులు ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రధాని నివాసంపై జరిగిన దాడిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేవని అధికారులు వెల్లడించారు. ఈ బాంబు దాడులను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రభుత్వం పేర్కొంది. దీనిపై త్వరితగతిన దర్యాప్తు చేయాలని ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఆదేశాలు జారీ చేశారు. నెతన్యాహును రెచ్చగొట్టడం మంచిది కాదని హెచ్చరించారు. ఈ దాడిపై న్యాయశాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని టెలీఅవీవ్ రక్షణ మంత్రి కాట్జ్ ఎక్స్‌లో కోరారు.

# సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు





**సిద్దిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు:** సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు సదర్ పండుగను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది సదర్ అంటే అందరిది.సదర్ అంటే ఉమ్మడి ఆస్తి. సదర్ అంటే అందరి పండుగ. పండుగ అనేది కులాల ఐక్యత పెంచుతది ఏ పండుగ అయిన ప్రజల మధ్య ఐక్యత పెంచుతది జాతీ మధ్య ఐక్యత పెంచుతది.మనమంతా రేపటి తరాలకు వారసత్వంగా అందించాలి.హైదరాబాద్‌కు, తెలంగాణకు ఒక ప్రత్యేకత ఉంటది. ప్రపంచంలో పూలను పూజించే పండగ ఒక్క తెలంగాణలో ఉంటది. బోనాల పండుగ.. అమ్మవారి కోసం ఎంతో గొప్పగా నిర్వహించే పండుగ కూడా హైదరాబాద్‌కే సొంతం. అడవి జంతువులను సాదు జంతువులుగా మార్చిన ఘనత యాదవులది. సాదు జంతువులుగా మార్చి.. ఈ ప్రపంచానికి పాలను అందిస్తూ యాదవులు సేవలు చేస్తున్నారు. దున్నపోతులను గౌరవించి, పండుగ జరిపే సంస్కృతి కూడా కేవలం తెలంగాణకే సొంతం. బతుకమ్మ అయినా, బోనాలు అయినా, సదర్ అయినా గొప్పగా జరుపుకొనేది తెలంగాణ సంస్కృతికి గొప్ప చిహ్నం అని చెప్పుకోవచ్చు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందింది.యాదవులకు లీటర్‌కు ఇన్‌సెంటివ్ స్కీం రూ.4 రూపాయలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ మేం వచ్చిన ఏడాదిలో ఎం తక్కువ చేశామని మాట్లాడుతుండు రేవంత్‌రెడ్డి అధికారంలో వచ్చాక పథకాలన్నీ బంద్ అయ్యాయ్. బతుకమ్మ చీరలు బంద్ చేశాడు. కేసీఆర్ కిట్‌లు బంద్ చేశాడు. రైతుబంధు బంద్ చేశాడు. యాదవులకు గొర్రె పిల్లల పంపిణీ పథకం బంద్ చేశాడు. రేవంత్ సీఎం అయ్యాక చేసిన మంచి ఏం లేదు. అయితే తిట్లు.. లేకపోతే దేవుడి మీద ఒట్లు తప్ప ఏం లేదు.రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండి మాట్లాడటం కాదు. సిద్దిపేట గల్లీలోకి వచ్చి అడుగు, ఈ రాష్ట్రంలోని పల్లెలకు వచ్చి అడుగు.ఏం తక్కువైందో ప్రజలు చెబుతారు.రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పోయింది. అన్ని వర్గాల ప్రజలు రేవంత్ పాలనలో ఇబ్బందులు పడుతున్నారు. అని హరీష్ రావు చెప్పుకొచ్చారు



## కల్లూరు సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమంలో సండ్ర

**కల్లూరు-ప్రభాత సూర్యుడు** సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం నందు కాటేపల్లి రజిని స్వామి, పోట్రు కిరణ్ స్వామిల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య , మరియు సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసం పూడి మహేష్ స్వామి, ఈ కార్యక్రమంలో కల్లూరు మరియు తల్లాడ మండల నాయకులు పాల్గొన్నారు.



## బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్‌కు వినతి

**ఖమ్మం-ప్రభాత సూర్యుడు:** నగరంలో కలెక్టరేట్ లో జరిగిన బీసీ కులాల ప్రజాభిప్రాయ సేకరణలో కార్యక్రమంలో భాగంగా బీసీ డెడికేషన్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు కి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా తరఫున ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిన అవసరం ఎంత ఉందని అది జరగపోవటం వల్లే బీసీ సమాజంలో రాజ్యాధికారంలో వాటా రాకుండా పోతుందని ఇప్పటికీ గ్రామాల్లో బీసీలను కులాల కోరుతూనే పిలుస్తున్నారు ఈ స్థాయి భేదాలు పోవాలంటే ఖచ్చితంగా చట్టసభల్లో రాజ్యాధికారంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు వారి జనాభా ప్రకారం అందినాడే సమ సమాజం స్థాపన జరుగుతుందని స్వాతంత్ర ఫలాలు అందరికీ అందుతాయని అన్నారు. ఈ కులగనన ఒక మంచి పరిణామాన్ని దీనివల్లనే సమాజంలో కులాల వారీగా జనాభా లెక్కలు మాత్రం కాదు సామాజిక కార్తిక పరిస్థితి కూడా అర్థమవుతుందని దాన్నిబట్టి ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని ఈ దేశంలో కుల గణన ఎంతో అవసరమని అది స్వాతంత్రం రాకముందు కూడా జరిగిందని అని , ఇప్పుడు కూడా జరగాల్సిన అవసరం ఉందని, జరగపోవటం వల్లే స్థాయి భేదాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్ల మాస సుగుణ, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్ గద్దె వెంకటరామయ్య కేతనబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

### చిలుకూరు మండలం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రాంబాబు

**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):** ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. చిలుకూరు మండలంలోని మిట్స్, గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులను తనిఖీలు నిర్వహించి పరీక్ష గదిలోకి అనుమతి ఇచ్చారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**కల్లూరు-ప్రభాత సూర్యుడు:** కల్లూరు మండల లబ్ధిదారులుకు సిఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేయడం జరిగింది. అనంతరం ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఏఎంసీ డైరెక్టర్ దోడ్డపునేని శ్రీనివాసరావు ,సొసైటీ డైరెక్టర్ బండి శ్రీనివాసరావు మరియు కాంగ్రెస్ నాయకులు పొట్రు సత్యం , పోట్రు అర్జున్ రావు కాంగ్రెస్ యువజన నాయకులు నల్లగట్ల పుల్లయ్య చేతుల మీదగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిలారి రామారావు,తాళ్ళ రాములు, కోపిల ఏసు మరియు కాంగ్రెసు నాయకులు ,కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా కార్తీక కాకతీయ కమ్మ సంఘం వనభోజనాలు

**చిలుకూరు (ప్రభాత సూర్యుడు)** మండల కేంద్రం చిలుకూరులో ఆదివారం కాకతీయ కమ్మ సంఘం వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముందుగా రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణకుంభంతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొడ్రాయి వద్ద జలాభిషేకం నిర్వహించారు. గ్రామ శివారు తోటలో ఉసిరి చెట్టు కింద పిల్లలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురిని సత్కరించారు. కార్తీక వనభోజనాల సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కమ్మ సంఘం నాయకులు, చిలుకూరు, రామాపురం కమ్మ సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక

### అధ్యక్షులుగా సూరిబాబు మాదిగ



**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):**చిలుకూరు మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి కోటేష్ మాదిగ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు మల్లె పంగు సూరిబాబు, అధికార ప్రతినిధిగా వేముల భార్గవ్, ఉపాధ్యక్షులుగా వేముల అశోక్ మాదిగ, కార్యదర్శిగా కందుకూరు శ్రీను మాదిగ, సహాయ కార్యదర్శిగా కందుకూరి రామారావు మాదిగను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం ఎస్ పి కోఆర్డినేటర్ సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ పాల్గొన్నారు. సునీల్ మాదిగ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కందుకూరు లచ్చయ్య, సిద్దెల పిచ్చయ్య, ముదిగొండ గురవయ్య, మల్లెపువ్వ మహేష్, ముదిగొండ అంజి, వడ్డేపల్లి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వృద్ధుని మృతి



**సిద్దిపేట జిల్లా - ప్రభాత సూర్యుడు:** మనస్తాపం తో ఉరి వేసుకున్నా ఘటన చిన్న కోడూర్ మండల కేంద్రం లో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే కర్నె రాంరెడ్డి తండ్రి ధర్మారెడ్డి వయసు 70 సంవత్సరాలు నివాసం చిన్నకోడూరు.రామ్‌రెడ్డి కి మరియు అతని తమ్ముడు యాదవ రెడ్డి కుటుంబానికీ మద్య గత కొన్ని రోజులుగా ఆస్తి పంపకాల విషయం లో వివాదాలు నడుస్తున్నవి. మరియు అతని తల్లి లక్ష్మి పోషణ విషయంలో కూడా వివాదం నడుస్తోంది. ఐతే ఇట్టి విషయం పెద్ద మనుషులా సమక్షం లో పలుమార్లు పంచాయతీ లు కూడా నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. దాంతో, గతవారం రోజుల నుండి రామ్ రెడ్డి సమస్య ఇంకా పరిష్కారం అవ్వట్లేదు అని దిగులుగా ఉన్నాడు. ఈ రోజు ఉదయం మూడు గంటలకు లేచి పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి అలాగే పెద్ద మనుషులు అయినా. పోశయ్య , కనుకయ్య లను కలిసి మాట్లాడి వస్తాను అని చెప్పి ఇంటి నుండి పోయి మనస్తాపం తో పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయినాడు.కుమారుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చిన్నాకోడూర్ ఎస్ఐ తెలిపారు

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# చంద్రబాబు హామీలకే పరిమితం

## సర్‌ఛార్జీల పేరిట వసూళ్లు దారుణం : సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

**అమరావతి, (ప్రభాత సూర్యుడు):** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చక ప్రజలపై పెనుభారం మోపేలా చర్యలు తీసుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సర్‌ఛార్జీల పేరిట సుమారు 18 వేల కోట్ల రూపాయలు భారం మోపడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 19న విజయవాడలో భారీ నిరసన తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీ చరిత్రలో ఏనాడూ లేని విధంగా ట్రూ అప్ ఛార్జీ భారాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించలేక పోతున్నారని విమర్శించారు. మంత్రు ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల సామర్థ్యం తగ్గించి రూ. 25 వేల కోట్ల ఆదాయం చేసుకోవాలని కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. పోలవరం విషయంలో కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను చంద్రబాబు ఏపీ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తానని చంద్రబాబు ప్రకటిస్తున్నారని వెల్లడించారు. వాస్తవానికి పోలవరం అంశంలో కేంద్రం వైఖరిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రానికి నీటిరంగంలో ప్రమాదం సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

# పార్లమెంట్ సీట్లు పెంచుతారా?

జనగణనకు కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మహిళలకు చట్టసభల్లో మూడవ వంతు స్థానాల కేటాయింపు, నియోజకవర్గాల పునర్విభజనకు మార్గం సుగమం కానుంది. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను 848కి పెంచుతారా? లేక కేంద్రం చెప్తున్నట్టు 888కి పెంచుతారా? అనే అంశం తెలియాల్సి ఉంది. ఏతావాతా మహిళా రిజర్వేషన్లు, పునర్విభజన అమలయ్యే అవకాశం ఉంది. కానీ, లోక్‌సభ సీట్ల పెంపు మాత్రం రాజ్యాంగ సవరణ చేస్తేనే తప్ప సాధ్యపడదు. జనగణన తర్వాత జరిగే పునర్విభజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల సంఖ్య వరుసగా 175 నుంచి 225, 119 నుంచి 153కి పెరిగే అవకాశం ఉ ఒడటం గమనార్హం. 128వ రాజ్యాంగ సవరణ చట్టం (106వ రాజ్యాంగ సవరణ) అమల్లోకి వచ్చిన 2023 సెప్టెంబర్ 19వ తేదీ తర్వాత జరిగే తొలి జనగణన లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేసి, మహిళలకు రొటేషన్ పద్ధతిలో మూడో వంతు సీట్లను 3 పర్యాయాలు కేటాయించాలని పార్లమెంట్ నిర్దేశించింది. దీనివల్ల 2026 తర్వాత జరిగే జనగణనతో పునర్విభజన అనే నిబంధన తొలగిపోతుంది. చివరిదైన పార్లమెంటు స్థానాల పెంపునకు 84వ అధికరణాన్ని సవరించడం ద్వారా 82వ అధికరణానికి ఉన్న అడ్డంకిని అధిగమించవచ్చు.



### జమ్మూకశ్మీర్‌లో ఎలా పెంచారు?

2026 తర్వాత జరిగే తొలి జనగణన ప్రకారం పునర్విభజన చేయాలని 84వ అధికరణం చెబుతున్నది. అయినప్పటికీ, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్థానాలను 83 నుంచి 90కి పెంచి ఎన్నికలు నిర్వహించారు. 370వ అధికరణం రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హెూదా ఏమీ లేదు. ఆర్టికల్ 3, 4 ప్రకారం జమ్మూకశ్మీర్ రాష్ట్ర విభజన చట్టాన్ని ఆమోదించారు. ఆ చట్టంలో 2026 జనగణన తర్వాత అనే అంశానికి బదులుగా 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేయాలని పేర్కొన్నారు. అందువల్లనే అక్కడ సాధ్యపడింది. మహిళా బిల్లు కూడా 2026 తర్వాత జరిగే జనగణన స్థానంలో 84వ అధికరణానికి బదులుగా 128వ రాజ్యాంగ సవరణ తర్వాత జరిగే జనగణన ద్వారా పునర్విభజన జరపాలని ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు.

### అమలుకు మార్గాలు:

2024, 2025లో జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్పీఆర్) పూర్తి చేసుకుని, 2026 జనవరిలో జనగణన వివరాలు డిజిటల్ విధానంలో ట్యాబ్‌ల ద్వారా సేకరిస్తారు కాబట్టి త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది. 2026 జనవరి నాటికి జనగణన పీసీఏ (ప్రైమరీ సెన్సస్ అబ్‌స్ట్రాక్ట్)ను ప్రకటించవచ్చు. ఇది పునర్విభజనకు సరిపోతుంది. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్ స్థానాలను పెంచుతారా? లేక మరో 20 ఏండ్లు నిషేధం పొడిగిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుత లోక్‌సభ స్థానాల ప్రకారం పునర్విభజన చేస్తే ఉత్తరాదిలో భారీగా సీట్లు పెరిగి, దక్షిణాదికి తీవ్రంగా నష్టం జరుగుతుంది. అలాకాకుండా మొత్తం సీట్లను 848 లేదా 888కి పెంచుతారా? అన్నది ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. ఈ అంశంపై బీజేపీ సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లే దు. ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా ఎన్డీ యే పక్షాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
ఒకవేళ పార్లమెంట్ స్థానాల సంఖ్య పెంచే అవకాశం లేకపోయినా, 2026లో జనగణన పూర్తయితే పునర్విభజన జరిపి మహిళలకు 3వ వంతు సీట్లు కేటాయించవచ్చు. అలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల పెంపునకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఒక వ్యక్తి -ఒక ఓటు -ఒక విలువ అన్న ప్రజాస్వామిక, రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునఃకేటాయింపు, పునర్విభజన జరిగితే దక్షిణ, ఉత్తర భారత్‌ల మధ్య విద్వేషం పెరిగే అవకాశాలు లేకపోలేదు.

### నష్టపోనున్న దక్షిణాది రాష్ట్రాలు:

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల నిష్పత్తిలో గణనీయమైన మార్పులు న్నాయి. టోటల్ ఫెర్టిలిటి రేట్ (దేశ సగటు) 1971లో 5.2, 1981లో 4.5, 1991లో 3.6, 2001లో 3.1, 2011లో 2.4గా నమోదైంది. అయితే, ఉత్తరాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్‌లో జనాభా గణనీయంగా పెరగగా దక్షిణాది రాష్ట్రాలతో పాటు కొన్ని చిన్న రాష్ట్రాల్లో దేశ సగటు కంటే చాలా తక్కువగా జనాభా పెరుగుదల నమోదైంది.

### జనాభా నియంత్రణే శాపమా?

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం చైనాను అధిగమించి భారత్ ప్రపంచంలో అత్యధిక జనా భా ఉన్న దేశంగా అవతరించింది. ప్రస్తుతం భారత జనాభా 140 కోట్లకు పైగా ఉన్నట్టు ఓ అంచనా. మన దేశంలో జనాభా నియంత్రణకు 1950వ దశకం నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభాను విజయవంతంగా నియంత్రించాయి. ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం ఈ విషయంలో పూర్తిగా విఫల మయ్యాయి. అయితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. 2023 అంచనాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో ఒక పార్లమెంట్‌కు సగటున 23 లక్షల మంది జనాభా ఉండగా.. బీహార్‌లో 31 లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 23 లక్షలు, రాజస్థాన్‌లో 32 లక్షలు, ఏపీలో 21 లక్షలు, తెలంగాణలో 22 లక్షలు, మేఘాలయలో 16 లక్షలు, చండీగఢ్‌లో 12 లక్షలు, హిమాచల్‌ప్రదేశ్‌లో 18 లక్షల మంది జనాభా ఉ న్నారు. మొదటి మూడు పునర్విభజనలను జనాభా ప్రాతిపదికన చేసినప్పటికీ పైన పేర్కొన్న విధంగా దేశంలో జనాభా పెరుగుదల, తగ్గుదల విషయంలో వివిధ రాష్ట్రాలలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. లోక్‌సభ స్థానాలను 888కి పెంచితే 2026 జనాభా లెక్కల అంచనా ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లో 143, బీహార్‌లో 79, పశ్చిమబెంగాల్‌లో 60, మహారాష్ట్రలో 76, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 54, తమిళనాడులో 49, రాజస్థాన్‌లో 50, గుజరాత్‌లో 43 పార్లమెంట్ స్థానాలుంటాయి. అంటే ఈ కేటాయింపుల వల్ల దక్షిణాదిలో మొత్తంగా సీట్ల సంఖ్య 130 నుంచి 165కు పెరిగినప్పటికీ ఇప్పుడున్న లోక్‌సభలో 23.19 శాతంగా ఉన్న ప్రాతినిధ్యం 19 శాతానికి పడిపోతుంది. ఇది ఆందోళనకరమైన పరిణామం.
ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను మార్చకుండా 2025లో కొత్త జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిపి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. తెలంగాణ 3, ఏపీ 5, కర్ణాటక 2, తమిళనాడు 8, కేరళ 8 స్థానాలను కోల్పోతాయి. పశ్చిమబెంగాల్ 4, ఒరిస్సా 3, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఒక్కో సీటు చొప్పున నష్టపోతాయి. ఇక పెరిగే సీట్లన్ని హిందీ రాష్ట్రాల్లోనే. ఉత్తరప్రదేశ్‌లో 11, బీహార్‌లో 10, రాజస్థాన్‌లో 6, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ఒకటి చొప్పున సీట్లు పెరుగుతాయి. ఈ పునర్విభజన వలన వచ్చే దుష్పరిణామాల నివారణకు మరోసారి రాజ్యాం గ సవరణ చేయడం సముచితం.

### ప్రత్యామ్నాయ ప్రతిపాదన:

దేశవ్యాప్తంగా ఒక్కో రాష్ట్రంలో ఇప్పుడున్న పార్లమెంట్ స్థానాల సంఖ్యకు అదనంగా 33 శాతం పెంచితే బాగుంటుంది. అంటే ఈ లెక్కన ఉత్తరప్రదేశ్‌లో 27 స్థానాలు పెరుగుతుండగా, తమిళనాడులో 13, ఆంధ్రప్రదేశ్‌లో 8, తెలంగాణలో 5 స్థానాల చొప్పున పెరుగుతాయి. ఈ ఫార్ములా ప్రకారం అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుతాయి. ఇప్పుడున్న జనాభా, పార్లమెంట్ స్థానాల నిష్పత్తి కూడా అలాగే కొనసాగుతుంది. హిందీ బెల్టులో పెరిగే సీట్ల వల్ల లబ్ధి పొంది అధికారాన్ని ఎన్నటికీ తమ చేతిలో ఉంచుకోవాలన్న బీజేపీ ఆలోచనలు మారకుంటే విపత్కర పరిణామాలు సంభవిస్తాయి. ఉత్తరాది వారు తమకు ద్రోహం చేస్తున్నారని దక్షిణాది రాష్ట్రాలప్రజలు భావించే అవకాశం ఉంది. అంతేకాదు, దీనివల్ల సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుం ది. అదే జరిగితే దేశ విభజన దిశగా ఆలోచనలు పురుడు పోసుకునే అవకాశమూ లేకపోలేదు.

# ఓటమిలోనూ హుందాతనం



ఒత్తిడి లేదా ఓటమిలో హుందాతనాన్ని ప్రదర్శించడమే అసలైన ధైర్యసాహసాలని అమెరికన్ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే చెప్పారు. అయితే, డెమొక్రాటిక్ పార్టీ అమెరికా అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్ ఓటమి తర్వాత అంతకుమించి పరిణతిని చూపించారు. ఇంకా కోల్పోవడానికి ఏమీ లేని పరిస్థితుల్లో, శూన్యంలో నుంచి వచ్చిన హుందాతనం అది. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో మాత్రమే ఓడిపోలేదు, సెనేట్‌లోనూ ఆ పార్టీ తన మెజారిటీని కోల్పోయింది. ఇదొక విధంగా ఆ పార్టీని షాకింగ్‌కు గురిచేసే విషయం. ఒకవేళ కమలా హ్యారిస్ గెలిచి ఉంటే ఆమె సరికొత్త చరిత్ర సృష్టించేవారు. శ్వేత సౌధంలోకి కాలుమోపిన మొదటి మహిళగా, రెండో నల్ల జాతీయురాలిగా, దక్షిణాసియా మూలాలున్న మొదటి వ్యక్తిగా నిలిచేవారు. కమలా హ్యారిస్ విజయానికి ఆమె జాతి, లింగం అడ్డంకిగా మారాయా? అన్న ప్రశ్న ఇప్పుడు అందరి మదిని తొలుస్తున్నది. ఒకవేళ అదే నిజమైతే ఉదారవాదానికి పట్టుగొమ్మగా ప్రచారం చేసుకునే అమెరికా దృక్పథం ఇంకా మారలేదని అర్థం చేసుకోవచ్చు. హిల్లరీ క్లింటన్ తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైన రెండో మహిళ కమలా హ్యారిస్. శ్వేతసౌధంలో ఒక మహిళను చూడటాన్ని అమెరికా ప్రజలు ఇష్టపడటం లేదా? ఇప్పటికీ వారు అందుకు సిద్ధంగా లేరా? అన్న ప్రశ్నలను ఆమె ఓటమి లేవనెత్తుతున్నది. అంతేకాదు, అమెరికాలో శ్వేతజాతీయుల ఆధిపత్యం ఇంకా కొనసాగుతున్నదని దీని ద్వారా తెలుస్తున్నది. కమ లా హ్యారిస్ ఓటమిలో ఈ రెండూ కీలకపాత్ర పోషించాయి. అయితే, ఈ అంశాలు ఆమె పోరాటంపై ఏ మాత్రం ప్రభావం చూపలేదనడంలో ఎలాంటి సందేహం లేదు. వాస్తవానికి, క్లిష్ట సమయంలో జో బైడెన్ అమెరికా అధ్యక్షునిగా ఉన్నారు. గత నాలుగేం డ్లు అధికార డెమొక్రాటిక్ పార్టీకి గడ్డుకాలం నడిచింది. కరోనా సంక్షోభం, ఆర్థిక కష్టాలు, నిరుద్యోగం, గాజా-ఇజ్రాయెల్, ఉక్రెయిన్-రష్యా యుద్ధాలు డెమొక్రాట్లను బాగా దెబ్బతీశాయి. బైడెన్ పట్ల వ్యతిరేక పవనాలు వీస్తున్నప్పటికీ, రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నప్పటికీ.. డెమొక్రాటిక్ పార్టీ నుంచి జో బైడెన్ మళ్లీ అధ్యక్ష బరిలో నిలిచారు. పోటీ నుం చి ఆయనను తప్పించడానికి మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్ రంగంలోకి దిగా ల్సి వచ్చింది. డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌కు ముందు కమలా హ్యారిస్ నామినేషన్‌కు మార్గం సుగమం చేసేందుకు జో బైడెన్‌కు 11 గంటల సమయం మాత్రమే ఇచ్చారు. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమలా హ్యారిస్‌ను అధికారికంగా ప్రకటించిన తర్వాత ఆమెకు 107 రోజుల సమయం మాత్రమే మిగిలింది. అప్పటికే బైడెన్ ఎన్నికల ప్రచారంలో పట్టు కోల్పోయారు. పాపులర్ రేటింగ్‌లోనూ ఆయన వెనుకబడ్డారు. డొనా ల్డ్ ట్రంప్‌తో జరిగిన టీవీ డిబేట్‌లోనూ ఘోరం గా తడబడ్డారు.

డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీల అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగే టీవీ డిబేట్లకు ఘన చరిత్ర ఉన్నది. 1960లో మొదటిసారి ఈ డిబేట్ ప్రారంభమైంది. డెమొక్రాటిక్ అభ్యర్థి జాన్ ఎఫ్ కెన్నెడీ, రిపబ్లికన్ అభ్యర్థి రిచర్డ్ ఎం నిక్సన్ మధ్య మొదటి డిబేట్ జరిగింది. ఆ ఎన్నికలో నిక్సన్‌పై కెన్నెడీ గెలుపొందారు. కానీ, 2024లో జరిగిన డిబేట్‌లో బైడెన్ గందరగోళానికి గురై డెమొక్రాటిక్ పార్టీ ఆశలపై నీళ్లు చల్లారు. అక్కడినుంచే ఆ పార్టీ గెలుపు అవకాశాలకు గండిపడ్డాయి.

అయినప్పటికీ, కమలా హ్యారిస్ ఆ అంతరా న్ని పూడ్చగలిగారు. హెూరాహెూరీగా సాగిన పోరు లో ట్రంప్‌కు ఆమె గట్టి పోటీ ఇచ్చారు. అతి తక్కువ సమయమే ఉన్నప్పటికీ ప్రభావవంతంగా ప్రచారం చేయడానికి ఆమె చాలా కష్టపడ్డారు. ఒక నెరేటివ్‌ను సృష్టించడానికి, ఒక విజన్‌ను ఆవిష్కరించడానికి, తన మద్దతుదారులు, ప్రజల్లో ఉత్సాహం తీసుకురావడానికి ఆమె దేశమంతటా సుడిగాలి పర్యటనలు చేశారు.

మంచి సమాజాన్ని నిర్మించడం, ప్రజలను ఏకం చేయడం, అమెరికా భవిష్యత్తు కోసం దేశం పై ప్రేమతో ఉత్సాహంగా పోరాటం చేయడం తదితర విషయాల్లో కమలా హ్యారిస్ చాలా ఉత్సుకత తో ఉన్నారు. 'మనల్ని విడదీసే అంశాల కంటే మనందరినీ కలిపి ఉంచే ఉమ్మడి అంశాలే ఎక్కువగా ఉన్నా'యని ఆమె ఇటీవల పేర్కొన్నారు. ఆమె ఓటమి పాలవడం విచారకరం. అయినప్పటికీ, హుందాతనంతో 'నేను ఈ ఎన్నికలను అంగీకరిస్తా. కానీ, ఎన్నికల ప్రచారానికి ఆజ్యం పోసిన పోరులో మాత్రం వెనకడుగు వేయ'నని ఆమె అన్నారు. అంతేకాదు, అమెరికా ప్రజలకు భవిష్యత్తుపై ఆశ కల్పిస్తూ ఓటమి అనంతరం కమల సందేశమిచ్చారు.

# దిగుమతులతో దేశ భద్రతకు ముప్పు!

ఆధునిక కాలంలో ఎవరూ ఊహించని రీతిలో హెజ్బొల్లాపై ఇటీవల ఇజ్రాయెల్ చేసిన వినూత్నమైన దాడులు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయి. హెజ్బొల్లా తీవ్రవాదులే లక్ష్యంగా జరిగిన పేజర్లు, వాకీటాకీల పేలుళ్లలో ఆ సంస్థకు భారీ నష్టం జరిగింది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించగా.. వేల మంది గాయాలపాలయ్యారు. ప్రధానంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పరికరాలే లక్ష్యంగా జరిగిన ఈ దాడులు సరికొత్త భయాందోళనలకు దారితీశాయి. దిగుమతి చేసుకునే ఆయుధాల వాడకంపై అనుమానాలను రేకెత్తించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా రక్షణరంగ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉన్న నేపథ్యంలో దేశ భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఏడాది కిందట మొదలైన యుద్ధం క్రమంగా పశ్చిమాసియా అంతటా వ్యాపిస్తున్నది. ఈ యుద్ధంలో ఇరువైపులా భారీగా ప్రాణనష్టం సంభవించింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్, లెబనాన్ లాంటి దేశాలు, హెజ్బొల్లా, హౌతీ లాంటి ఉగ్రవాద సంస్థలు పాలస్తీనాకు మద్దతుగా నిలిచాయి. లెబనాన్ పరోక్ష సహకారంతో ఇజ్రాయెల్‌పై మొదటినుంచీ హెజ్బొల్లా విరుచుకుపడుతున్నది. దాన్ని నిలువరించే క్రమంలోనే పేజర్లు, వాకీటాకీలను ఇజ్రాయెల్ పేల్చింది. టెలిఫోన్లు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు లాంటి అధునాతన కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలోనూ హెజ్బొల్లా ఇప్పటికీ పేజర్లు, వాకీటాకీలనే వాడుతుండటం ఆశ్చర్యకరం. అత్యాధునిక పరికరాలను ఉపయోగించి హెజ్బొల్లా జరిపే అన్ని సంభాషణలను ఇజ్రాయెల్ ట్రాక్ చేస్తున్నది. ఈ కారణంగానే ఇజ్రాయెల్ వద్దనున్న ట్రాకింగ్ వ్యవస్థలకు చిక్కకుండా ఉండేందుకు దశాబ్దాల కిందటి పేజర్లనే హెజ్బొల్లా వినియోగిస్తున్నది. తయారీ సమయంలోనే పేజర్లను ట్యాంపర్ చేసి, వాటిలో చిన్న మొత్తంలో పేలుడు పదార్థాలను ఇజ్రాయెల్ అమర్చినట్టు తెలుస్తున్నది. ఇప్పుడు ఈ అంశమే మన దేశం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్తున్నది. ఎందుకంటే, ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నది మన దేశమే కావడం గమనార్హం. ప్రపంచ దిగుమతుల్లో భారత్ వాటా 9.8 శాతం. స్టాక్‌హెూమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రీ) ప్రకారం.. 2014-23 మధ్యకాలంలో బీజేపీ హయాంలో గతంతో పోలిస్తే 4.7 శాతం దిగుమతులు పెరిగాయి. భారత దిగుమతుల్లో 36 శాతం రష్యా నుంచి వస్తున్నవే. ఫ్రాన్స్, అమెరికాల వాటా 46 శాతం. అంతేకాదు, ఇజ్రాయెల్‌తో పాటు మరికొన్ని దేశాల నుంచి కూడా భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నది. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా లాంటి గొప్ప గొప్ప నినాదాలు ఇచ్చే మోదీ హయాంలోనే రక్షణరంగ దిగుమతులు మరింతగా పెరిగాయి. అదే సమయంలో బడ్జెట్‌లో రక్షణరంగ కేటాయింపులు భారీగా పడిపోయాయి. 2014లో మొదటిసారి మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో 17 శాతంగా ఉన్న రక్షణరంగ కేటాయింపులు తాజా బడ్జెట్‌కు వచ్చేసరికి 13 శాతానికి దిగజారాయి. అంతేకాదు, రక్షణరంగ వ్యయం జీడీపీలో 2 శాతం కంటే దిగువకు పరిమితమైంది. విదేశాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటుండటం వల్ల మరో నష్టమూ జరుగుతున్నది. ఆలస్యం కారణంగా ఉత్పత్తులు సమయానికి అందుబాటులోకి రావడం లేదు. తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ విషయాన్నే తీసుకుందాం. ఈ ఫైటర్ జెట్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి. విదేశాల నుంచి దిగుమతి కావాల్సిన దాని ఇంజిన్ సమయానికి అందకపోవడమే అందుకు ప్రధాన కారణం. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ ఇంజిన్‌ను సమయానికి అందించడంలో విఫలమవడంతో ఈ ఏడాది మార్చిలో అందుబాటులోకి రావాల్సిన ఈ ఫైటర్ జెట్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. జెట్ ఇంజిన్ ఉష్ణోగ్రతను గణించే ఓ చిన్న పరికరం కూడా ఇంకా దిగుమతి కాలేదు. ఇలా చిన్న చిన్న పరికరాల కోసం కూడా విదేశాలపై ఆధారపడటం మన రక్షణ రంగ దుస్థితికి నిదర్శనం. పాకిస్థాన్‌కు అతిపెద్ద రక్షణ రంగ ఎగుమతిదారుగా ఉన్న చైనాలో తయారైన డ్రోన్ పరికరాలను దేశంలోని పలు కంపెనీలు దిగుమతి చేసుకుంటున్నాయి. డ్రోన్లలో వాడే కెమెరాలు, సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ పరికరాలకే ఈ నిషేధం



పరిమితమైంది. హెజ్బొల్లాపై జరిగిన దాడుల నేపథ్యంలో ఇతర పరికరాలపై నిషేధం విధించడంతో పాటు దిగుమతులను కూడా భారీగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉన్నది. అయితే, దేశంలో ఒక్కసారిగా విదేశీ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడం అంత సులభం కాదు. దేశంలో ఉత్పత్తిని పెంచుకుంటూ క్రమంగా తగ్గించడం కష్టసాధ్యమూ కాదు. ప్రోటోటైప్ దశలో విదేశీ పరికరాలను వినియోగించడం వల్ల ఎలాంటి నష్టం ఉండదు. కానీ, ఉత్పత్తికి వచ్చేసరికి కచ్చితంగా దేశీయంగా తయారైన పరికరాలనే వాడాలి. అందుకు ఆత్మనిర్భర్ భారత్‌ను మరింత పటిష్ఠం చేయాలి. నినాదాలకే పరిమితమైపోయిన మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లను క్షేత్రస్థాయిలోనూ అమలు చేయాలి. అందుకు బడ్జెట్ కేటాయింపులను పెంచడంతో పాటు ప్రభుత్వ రక్షణరంగ సంస్థలను బలోపేతం చేయాలి. దాంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులకు కూడా ఎర్రతివాచీ పరచాలి. అప్పుడే దిగుమతుల తగ్గింపుతో పాటు దేశీయ ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా చేరుకోగలం.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215